క్లుప్తంగా

ఎక్స్‌టర్నల్ పోస్టుల సంఖ్య పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో ఎక్కువ పోస్టులు కేటాయించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను వినతిపత్రం అందజేసి మాట్లాడారు.హైకోర్టు తీర్పు ప్రకారం 33శాతం ఇంటర్నల్ ఉద్యోగులకు, 66శాతం ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు కేటాయించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా కేటాయించడంతో నిరుద్యోగులు నష్టపోనున్నారని తెలిపారు.ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించాలని కోరారు.

బీఆర్‌ఎస్ సమన్వయకర్తగా గిరిబాబు

జూలూరుపాడు: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్తగా జూలూరుపాడు మండలానికి చెందిన లకావత్ గిరిబాబు నియమితులయ్యారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న గిరిబాబును బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు నియమించారు. ఈ విషయాన్ని గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

జూలూరుపాడు: వెంగన్నపాలెం జమ్మికుంట చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు శుక్రవారం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. జమ్మికుంట చెరువును స్థానికులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మించడంతోపాటు, ఈత చెట్లను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మాణంపై మహిళ ఆందోళన

కొత్తగూడెంఅర్బన్: ఇళ్లకు, ప్రజలకు ఆంటకాలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని పట్టణ పరిధి గాజులరాజం బస్తీలో ఓ మహిళ శుక్రవారం ఆందోళన చేపట్టింది. వివరాలు.. గాజులరాజం బస్తీలోని ఓ వీధిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదే ఏరియాకు చెందిన గాయత్రీ అనే మహిళ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టింది. కక్ష సాధింపు చర్యలో భాగంగా అధికారులు, వార్డు కౌన్సిలర్ కలిసి మా ఇంటికి నష్టం జరిగే విధంగా నిర్మాణం చేస్తున్నారని ఆరోపించింది. డ్రెయినేజీ మురుగు తన ఇంట్లోకి వస్తోందని, రాకుండా నిర్మాణం చేపట్టాలని కోరింది. అనంతరం సంఘటన స్థలానికి త్రీటౌన్ పోలీసులు చేరుకొని, మున్సిపల్ అధికారులతో చర్చలు జరిపి రోడ్డు నిర్మాణం ఎవరికీ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచనలు చేశారు. దీంతో మహిళా ఆందోళన విరమించింది.

రోడ్డు పక్కన గది నిర్మాణంపై అభ్యంతరం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి గాజులరాజం బస్తీ ఏరియా ఇండియన్ గ్యాస్‌కు వెళ్లే మార్గంలో బోరు ఏర్పాటు చేసి, రూం నిర్మాణం చేయడం పట్ల అక్కడి స్థానికులు, మాజీ వార్డు కౌన్సిలర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. 24వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఆదేశాలతో బోరును ఏర్పాటు, అదే స్థలంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు రూం నిర్మాణం సైతం చేపట్టారని మాజీ వార్డు కౌన్సిలర్ లక్ష్మీబాయి ఆందోళన చేశారు. గతంలో కూడా ప్రజలకు నీటి సదుపాయం కొరకు అక్కడ బోరు తవ్విస్తే మురికి నీరు వచ్చిందని, ఆ బోరును దమ్ము చేయించడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సంఘటనపై మున్సిపల్ డీఈ రవికుమార్‌ను వివరణ కోరగా, బోరుకు, రూంకు మున్సిపల్ నుంచి అనుమతులు లేవని వివరించారు.

బోరు బావి మంజూరు



బోరు డ్రిల్లింగ్ చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్సీ(మాల) కాలనీలో శనివారం బోరు బావిని ఏర్పాటు చేశారు. కాలనీవాసులు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో బోరుబావి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం కాలనీలో బోరు బావి నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వారధి కష్టాలు తీరేదెన్నడో?

- ప్రమాదకరంగా పెనుబల్లి లోలెవల్ వంతెన
- పూర్తి నిధుల మంజూరు కోసం నిరీక్షణ



పెనుబల్లి లోలెవల్ వంతెనపై వరద ప్రవాహం(ఫైల్)

చుంచుపల్లి: కొత్తగూడెం- పెనుబల్లి గ్రామాలను కలిపే లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. గడిచిన మూడేళ్లుగా దీన్ని పట్టించుకునే నాథుడే లేడు. ప్రజలు తమ ఇబ్బందులను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గతేడాది రూ.3.05 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ వంతెన పనులకు హడావుడిగా అధికారులు శంకుస్థాపన చేసి మమ అనిపించారు. మొత్తం బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.50 కోట్లు అవసరం ఉంది. మొదట కేటాయించిన నిధులు సరిపోవని అధికారులు పనులు ప్రారంభించేందుకు ముందుకు రాలేదు. దీంతో మళ్లీ వచ్చే వానాకాలంలో ప్రజలకు అవస్థలు తప్పేలా లేవు. చుంచుపల్లి మండల పరిధిలో మేజర్ పంచాయతీ పెనుబల్లి గ్రామ ప్రజలకు ప్రతీ వర్షాకాలంలో వరదల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా గ్రామస్తులకు వారధి కష్టాలు తీరడం లేదని వాపోతున్నారు. పెనుబల్లి గ్రామంలో రెండువేల వరకు మంది జనాభా నివాసం ఉంటున్నారు.

కొత్తగూడెం పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామస్తులు ప్రతీ చిన్న అవసరానికి నిత్యం జిల్లా కేంద్రం కొత్తగూడేనికి రావాల్సిందే. పెనుబల్లి- కొత్తగూడెం మధ్య గోధుమ వాగు ప్రవహిస్తుంది. దీనిపై ఏర్పాటు చేసిన లోలెవెల్ వంతెన దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించారు. నిత్యం గ్రామస్తులతో పాటు ఇతర అవసరాల నిమిత్తం దీని మీదుగా ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు దీనిపై నుంచే తిరుగుతుంటాయి. ప్రజలు సైతం కొత్తగూడెం పట్టణానికి రావాలంటే ఈ బ్రిడ్జి మీదుగా కాలినడకనే వస్తుంటారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన రెండేళ్లుగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా తయారైంది. నీ వంతెనపై అడుగడునా గుంతలు తేలి బీటలు ఏర్పడ్డాయి. ఇరువైపులా ఉండాల్సిన రక్షణ దిమ్మెలు సైతం ధ్వంసమయ్యాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన పూర్తిగా దెబ్బతినడంతో పంచాయతీ రాజ్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

వర్షాకాలంలో వరదతో అవస్థలు...

త్వరలో వర్షాకాలం మొదలు కానుండటంతో మళ్లీ ప్రజలకు అవే అవస్థలు ఎదురవుతాయనే ఆందోళనలో ఉన్నారు. ప్రతీ వర్షాకాలంలో భారీ వర్షాలకు పెనుబల్లి గ్రామానికి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతాయి. వరదల కారణంగా బాహ్య ప్రపంచంతో గ్రామస్తులకు నాలుగైదు రోజుల వరకు సంబంధాలు తెగిపోతాయి. వరద ఉధృతి తగ్గిన తర్వాతనే మళ్లీ రాకపోకలు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు మూడేళ్లగా అంచనాలు, ప్రతిపాదనలకే పరిమితమవుతున్న అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా పెనుబల్లి గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయిలో నిధులను కేటాయించి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి



పెనుబల్లి లోలెవల్ వంతెన మూడేళ్లుగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రతీ ఏటా వర్షాకాలం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనపై నడవాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు కొత్త వంతెన నిర్మాణానికి రూ.7 కోట్లకు పైగా అంచనాలు వేశారు. రూ.3.05 కోట్లు కేటాయించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసి వదిలేశారు.

– రెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, పెనుబల్లి

ప్రతిపాదనలు పంపించాం..



పెనుబల్లి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం దీనిపై నుంచి భారీగా వరద ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు హైలెవల్ కొత్త వంతెన కోసం మరికొన్ని ప్రతిపాదనలను పంపించారు. మంజూరు కాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జి.సత్యనారాయణ, ఎంపీఓ

‘రైతు బంధు’ను జమ చేసుకోవద్దు



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: బ్యాంక్ అధికారులు పాత బాకీల కింద రైతు బంధు పథకం ద్వారా వచ్చిన పైకాన్ని జమ చేసుకోవద్దని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బిక్కుతండా, కమ్మరిగూడేనికి చెందిన పలువురు రైతులు యూనియన్ బ్యాంక్‌లో వ్యవసాయ రుణాలు తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం రైతు బంధు పథకం నగదును రైతుల ఖాతాల్లో జమ చేయడంతో దానిని పాత బాకాయి కింద మినహాయించుకున్నారు. దీంతో శుక్రవారం కొత్వాల బ్యాంక్ మేనేజర్ నాగ శ్రీకాంత్‌తో మాట్లాడారు. త్వరలో ప్రకటించనున్న రైతు రుణమాఫీ పైకంతో వారి అప్పులు పూర్తిగా తీరే అవకాశం ఉందన్నారు. కొండెం వెంకన్న, బాలినేని నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పార్టీలో పనిచేయాలి

పాల్వంచ: కమ్యూనిస్ట్ పార్టీలో నిబద్ధతతో పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాత పాల్వంచకు చెందిన పలువురు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి, సభ్యత్వం అందించారు. మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారు నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేపడుతున్న అనేక అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కార్యాక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, శనిగారపు శ్రీనివాసరావు, పాషా పాల్గొన్నారు.

రాందాస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం..



మాట్లాడుతున్న శాంతిరామ్

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఉద్యమ రూపశిల్పి, తెలంగాణ ఉద్యమాన్ని సృష్టించిన తొలి ఉద్యమ నాయకుడు పొలిశెట్టి రాందాస్ విగ్రహాన్ని కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తామని 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వి.శాంతిరామ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో జరిగిన రాందాస్ సంతాపసభలో ఆయన మాట్లాడారు. 1969లో నాన్ ముల్కి గో బ్యాక్.. నినాదాలతో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని.. స్లోగన్స్‌తో ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. బస్టాండ్ సమీపంలో రాందాస్ విగ్రహాన్ని త్వరలో ప్రతిష్టిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో దోర్నాల పాపారావు, గొల్లపల్లి దయానంద్‌రావు, చింతలచెర్వు గెర్షోము, సూర్య అనంతరెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, ఆవుల కృష్ణ, వెంగల కనకయ్య, దూడల బుచ్చయ్య, చాంద్‌పాషా, బీమయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



జూలూరుపాడు: పూజలు చేస్తున్న భక్తులు



టేకులపల్లి: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో..

జూలూరుపాడు: శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం విశ్వబ్రాహ్మణులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవసమాధి అయిన రోజును ఆరాధన మహోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పాపకొల్లు, కాకర్ల శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో పూజారులు ఓంకారా చారి, శివ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, స్వామి వారి జెండాలను ఆవిష్కరించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

పాల్వంచ: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బండారు సత్యనారాయణ, వీరాచారి, నాగాచారి, బ్రహ్మారావు, దామోదరాచారి, శ్రీపాద సత్యనారాయణ, వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం టేకులపల్లిలోని గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పూజారి పవన్ కుమారాచార్యుల ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదరబస్తీలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం, అలంకార దర్శనం, పతాకావిష్కరణ, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అఖండ దీపారాధన పూజ, విశ్వశాంతి హోమం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాతకొత్తగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతు నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాతకొత్తగూడెం, గౌతంనగర్, పెనుబల్లి, గంగబిషన్ బస్తీ ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జూలూరుపాడు: పాపకొల్లు, పడమటనర్సాపురం, జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయన్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పొడిగింపు

ఇల్లెందురూరల్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరబోయే విద్యార్థులు దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను యూనివర్సిటీ అధికారులు మే 29 వరకు రూ.200 రుసుముతో పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ దోస్త్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూనివర్సిటీ కల్పించిన గడువు తేదీ పొడిగింపు సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాలలోని దోస్త్ కోఆర్డినేటర్లు సరితను సంప్రదించాలని సూచించారు.

మహిళ అదృశ్యం

జూలూరుపాడు: ఓ వివాహిత అదృశ్యంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 11న మాచినేనిపేటకు చెందిన బానోత్ సంధ్య అనే మహిళ భర్త బానోత్ రవితో గొడవపడి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం భర్త రవి, కుటుంబసభ్యులు వెతికినా దొరకలేదు. ఆరు రోజులుగా ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త రవి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంధ్య ఆచూకీ తెలిసిన వారు 8712682041, 8712682042 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

జీపీ కార్మికులపై తేనెటీగల దాడి

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో ముగ్గురు పంచాయతీ వర్కర్లతోపాటు పలువురు స్థానికులు తేనెటీగల దాడిలో గాయపడ్డారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఓ వీధిలో చెట్టు కింద పారిశుద్ధ్య పనులు చేస్తుండగా చెట్టు మీద ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి రావడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన కార్మికులను పంచాయతీ అధికారులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గాయాలు స్వల్పంగా ఉండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర

పాల్వంచ: శాసనమండలి ఎన్నికల్లో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పాత పాల్వంచలోని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గృహంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ... కేసీఆర్ చేసిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉందన్నారు. నిరుద్యోగ యువతకు అనేక ఐటీ కంపెనీలు, పరిశ్రమలు వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఎన్నికలు పరీక్ష లాంటివని ఇలాంటి సమయంలో కష్టపడి పార్టీని మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పథకాల అమలులో వెనకబడిందన్నారు. అనంతరం కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, రేగా కాంతారావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతామహాలక్ష్మి, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజుగౌడ్, వనమా రాఘవేందర్‌రావు, చందూనాయక్, దాసరి నాగేశ్వరరావు, సింధు తపస్వీ, అన్వర్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి..



ఇల్లెందు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శుక్రవారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు నమోదు చేసుకున్న పట్టభద్రులు తమ కోసం పని చేసే నేతను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్నబాక సత్యనారాయణ, ఎంసీ నాగిరెడ్డి, మునుగునూరు రమేష్, గుమ్మడి విద్యాసాగర్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడారు.

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచిన జర్నలిస్ట్ తీర్మాన్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలిపిందన్నారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేవిధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని చంద్ర కృష్ణమూర్తి భవన్‌లో శుక్రవారం కొండపల్లి రఘు అధ్యక్షతన ఏర్పాటైన ఇఫ్టూ అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సిద్ధించిన తరువాత పదేళ్లపాటు ఏలిన బీఆర్‌ఎస్.. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను విస్మరించిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ వేతనం పెంచుతుందన్న నమ్మకంతో కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, వారి నమ్మకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వమ్ము చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశామని వివరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్‌షావలి మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ లెక్కలు మూడు సంవత్సరాలుగా చూపడం లేదన్నారు. దీనికోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇల్లెందు బ్రాంచ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షుడిగా వెంకట్‌భాయ్, ఉపాధ్యక్షుడిగా బాలు చౌహాన్, కార్యదర్శిగా కొత్తపల్లి రఘు, సహాయ కార్యదర్శిగా రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా సత్యనారాయణలను ఎన్నుకున్నారు. సమావేశంలో పాయం వెంకన్న, శ్యామల సుమిత్ర, శారద, ఇస్తారి, చంద్రు, నరసమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం



యూనియన్‌లో చేరిన కార్మికులతో నాయకులు

ఇల్లెందు: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను పరిగణలోకి తీసుకొని కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య డిమాండ్ చేశారు. స్థానిక విఠల్‌రావు భవన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచకుండా యాజమాన్యం అన్యాయం చేస్తోందన్నారు. ఈ నష్టాన్ని పరిగణలోకి తీసుకొని వేతనాల పెంపు శాస్త్రీయంగా చేపట్టి జీఓ నెం.22 ప్రకారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్‌లో నూతనంగా చేరిన కార్మికులకు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, రాజారామ్, నాగేశ్వరరావు, సుందర్, శంకర్, బందం నాగయ్య, శ్రీరాములు, రవిశంకర్, సుమన్, మోహన్, కనకతార, జమున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించండి..



కలెక్టర్‌ను కలిసిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ పోలూరు శ్రీకృష్ణ కుటుంబానికి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అందించాల్సిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే అందించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్‌ను పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా వెంటనే అందించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వివరించారు. వినతి అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేష్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, జిల్లా సంఘ బాధ్యులు కె.వెంకటలక్ష్మి, కే.అంబికాదేవి, వై.శ్రీకాంత్‌రెడ్డి, వెల్డి ప్రసాద్, కేవీడీ ప్రసాద్, తాళ్లూరి రవి పాల్గొన్నారు.

● వికసించిన ‘మే’ పుష్పం



టేకులపల్లి మండల కేంద్రానికి చెందిన వృక్ష ప్రేమికుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మౌలానా ఇంట్లో శుక్రవారం మే పుష్పం వికసించింది. కుండీలో పెరిగే ఈ మొక్కకు పత్రాలు ఉండకపోవడం ప్రత్యేకత. మండు వేసవి మే నెలలో మాత్రమే ఇది పుష్పిస్తుంది. ఈ పుష్పం ఎరుపురంగులో గుండ్రటి ఆకారంతో తళుకులీనుతూ కనువిందు చేస్తోంది. స్థానికులు ఈ పుష్పాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు.

– టేకులపల్లి